మధుకర్ చైన్ స్మోకర్. కానీ తను కల్సినప్పటినుంచి, కూల్‌డ్రింక్ షాప్‌లోంచి బయటికొచ్చినా, అతని చేతిలో సిగరెట్ లేకపోవడంతో ఆశ్చర్యంగా చూసి-

“సిగరెట్లు మానేశావా?” అడిగింది.

“అవును” టక్కున జవాబిచ్చాడు మధుకర్ . చాలా సంతోషం వేసింది.

“నా బస్సొచ్చింది, వెళ్ళనా?” అంది.

“కాసేపు ఉండవచ్చు కదా?” అతని మనసులోని మాట బయటకు రాలేదు.

గబగబా రోడ్ క్రాస్‌చేసి, బస్సెక్కింది మహతి. కదిలిన బస్సులో వెళ్ళిపోతున్న మహతి కనుమరుగయ్యేవరకూ అలా చూస్తూనే వున్నాడు మధుకర్ .

అతనికి ఒక్కసారి--

మంచుకొండల మధ్య, మంచి సువాసనలు వెదజల్లే పూల మధ్య నిల్చున్నట్లుగా అనిపించింది-ఒకింత సేపటికి తేరుకుని రోడ్డుమీద నడవడం ప్రారంభించాడు.

ఇంట్లోంచి బయటికొచ్చిన తర్వాత, మొట్టమొదటిసారి ఒక వ్యక్తిగా మధుకర్‌గా అంతులేని ఆనందాన్ని పొందిన రోజది.

ఆ ఆనందానికి రూపం లేదు-భాష కూడా లేదు.

* * * *

సడన్‌గా డిస్పెన్సరీ కొచ్చిన మహతిని చూసి ఆశ్చర్యపోయింది డాక్టర్ హేమలత .

“ఆ రోజలా వెళ్ళిపోయినదానివి ఇలా తేలావన్నమాట?” నవ్వుతూ విష్ చేసింది హేమలత .

“ఒకసారి నన్ను టెస్ట్ చెయ్యి. అర్జంటు పనుంది వెళ్ళిపోవాలి” కంగారు, కంగారుగా అంది మహతి.

టెస్టింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళి టెస్ట్ చేసి-

“ఇంకా ఫిఫ్టీన్ డేస్ అయితేనే గాని చెప్పలేను. ఎందుకింత కంగారు? నువ్వు ప్రెగ్నెంట్‌వి అవుతావని చెప్పానుగదా!” చిరుకోపంగా అంది హేమలత .

“మరోసారి కన్‌ఫర్మ్ చేసుకుందామని.”

“ఇప్పుడేం చేస్తున్నావ్, ఆ టైలరింగ్ షాపులోనేనా? ఎందుకే ఆ బాధలు?” ఒకింత బాధగా అంది హేమలత .

“నాకు పనుంది. సీ యూ ఎగైన్! బై!”

ఆదరా బాదరాగా బయటకొచ్చేసింది మహతి.

నేరుగా రూంలోకెళ్ళిపోయింది.

ఫ్యాషన్స్, డిజైన్స్ బుక్స్‌ని, నేషనల్, ఇంటర్నేషనల్ సినిమా మాగజైన్స్‌ని కొన్ని పాత న్యూస్‌పేపర్స్‌ని, సిజర్, పెన్స్‌ని దగ్గరేసుకుని కూర్చుంది.

ఆ రోజు రాత్రి ఆమెకు నిద్రలేదు. అలాంటి చాలా నిద్రలేని రాత్రులు గడిచాయి.

* * * *

తెల్లవారుజాము మూడుగంటలైంది.

వీధులన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

పెట్రోల్ బంక్‌లో వున్న ఒక్క బాయ్ ఆఫీసు రూంలో జోగుతున్నాడు.

టేబుల్‌లైట్ వెలుగులో ఎకౌంట్స్ చూస్తున్న మధుకర్‌కు తలుపు ఎవరో తట్టడంతో తలెత్తి చూశాడు.

అద్దాల తలుపుల్లోంచి అవతలి వ్యక్తి చేసే సైగలు మాత్రమే కనిపిస్తున్నాయి.

పెట్రోలు పొయ్యమని అడుగుతున్నాడు.

గ్లాస్ డోర్ తీసుకుని బయటకొచ్చాడు. బాయ్‌ని మళ్ళీ లేపడం ఎందుకని తనే టాంక్‌ని ఓపెన్‌చేసి అయిలు పోసి డబ్బులు తీసుకున్నాడు. ఆ కారెళ్ళిపోయింది.

ఆ కారెళుతున్న వేపు అలా చూస్తూ నిలబడ్డాడు-అలా ఎన్నిసార్లు తను , ఇదే పెట్రోల్‌బంక్‌కు అదే టైమ్‌లో రాలేదు!

ప్రతిరోజూ రాత్రి మధుకర్‌కు ఆ సంఘటన గుర్తుకొస్తూనే వుంటుంది ఎప్పుడయినా, ఎన్నడయినా తనిలా అక్కడ వుంటాడని ఊహించాడా?

ఊహించని మార్పుల సంగమమే జీవితం.

ఆఫీస్ రూంవైపు వస్తూ, సర్రున వస్తున్న ఓ కారు హెడ్‌లైట్ల కాంతి మీద పడడంతో తలతిప్పి ఆ కారువేపు చూశాడు.

చెవర్లెట్ కారు-నల్లటి చీకట్లో బ్లాక్ పాంథర్‌లా ఉంది.

నెంబర్ ప్లేట్‌వేపు చూడగానే మధుకర్ ఒకింత ఉద్వేగానికి గురి అయ్యాడు.

తన తండ్రి కారు. లోన డాడీ ఉంటారా? తల తిప్పుకొని నిలబడ్డాడతను.

ఆ కారు డ్రయివింగ్ సీట్లోంచి దిగిన డ్రైవర్-

"ఇదిగో ఇరవై" అంటూ నాలుగు వంద రూపాయల నోట్లను అందివ్వబోతూ-

ఆ ముఖాన్ని చూసి, అవాక్కయిపోయి నిల్చుండిపోయాడు. అతని నోట్లోని మాట నోట్లోనే వుండిపోయింది.

"చిన్న బా ..... బూ ..... మీ ..... రు ..... "

తలొంచుకుని వెళ్ళి, ట్యాంక్ ఓపెన్‌చేసి ఆయిల్ పోసి, ఆ డబ్బు లందుకుని, డ్రైవర్‌కి చిల్లరిచ్చేసి-

చటుక్కున కారు వెనక డోర్‌వేపు చూశాడు. అంతవరకు క్లోజ్ చేసున్న బాక్ డోర్ గ్లాసెస్ ఎప్పుడు కిందకు జారాయో తెలీదు. అందులోంచి మధుకర్ వేపే చూస్తూ- రాఘవేంద్ర నాయుడు ..... !

చీకట్లో ఆ కళ్ళను గమనించి భయపడ్డాడు మధుకర్ . తర్వాత సిగ్గుపడ్డాడు. ఆకస్మాత్తుగా తన వంటినిండా చిరుచెమట పట్టడం తెలుస్తూనే వుంది అతనికి. ఆ కారులో తన తండ్రి ఆ సమయంలో ఉంటాడని ఊహించలేదతను. గబగబా ఆఫీసు రూంవేపు వెళ్ళబోయి, ఆ పిలుపు విని ఆగిపోయాడు.

“మధూ!”

ఆ కాటుక చీకటిలో ఆ పిలుపు చల్లని గాలిలా హాయిగా విన్పించింది అతనికి.

“కమ్ హియర్ మై బాయ్!” వెనక్కి తిరిగిన కాళ్ళు ముందు కడుగేశాయి. ఆ కారు బేక్ డోర్ దగ్గరకెళ్ళి నిలుచున్నాడు.

“హౌ ఆర్యూ మై సన్?”

మధుకర్  మాట్లాడలేదు.

“అమ్మ ప్రతిరోజూ నిన్నే తలచుకుంటోంది.”

మధుకర్ మాట్లాడలేదు.

“వెల్ ..... నౌ అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ మై సన్. కీపిటప్”

అక్కడ మరోక్షణం వుండడం వల్ల మానసికంగా మధుకర్ ఎంత బాధపడతాడో ఊహించాడు రాఘవేంద్ర నాయుడు .

“డ్రైవర్!” అన్న మరుక్షణం స్టీరింగ్ ముందు కూర్చున్నాడు డ్రైవర్.

“గుడ్‌నైట్!”

కారు ముందుకెళ్ళిపోయింది. మాటలు రానివాడిలా నిలబడి పోయాడు మధుకర్.

ఎందుకో అతని మనసునిండా ఒక్కసారి దు:ఖం కళ్ళు తడిసి పోయాయి. తల్లి జ్ఞాపకానికొచ్చింది.

కారు ఆ రోడ్ మలుపు తిరుగుతున్నపుడు--

“కారు దిగి తమరు పలకరిస్తే చినబాబు మనసు పొంగిపోయేది అయ్యగారు” చనువుగా అన్నాడు డ్రైవర్. అదే సమయంలో, అదే విషయం గురించి ఆలోచిస్తున్నాడు రాఘవేంద్ర నాయుడు .

కొడుకుని తను చూసిన విషయం భార్యతో చెప్పాలని ఉవ్విళ్ళూరుతున్నాడు రాఘవేంద్ర నాయుడు .

డ్రైవర్ మాటకు జవాబు చెప్పకుండా “త్వరగా పోనీ” అనేసి మాత్రం వూరుకున్నాడు.

* * * *

స్విచ్ వెల్ టైలరింగ్ సెంటర్లో ఒక అయిదుగురు అసిస్టెంట్లతో తన కార్యక్రమాన్ని ప్రారంభించింది మహతి.

ప్రారంభించిన మొట్టమొదటి రోజే తన టార్గెట్ గ్రూప్‌ని ఎంపిక చేసుకుంది.

ఫ్యాషన్‌లను క్రేజీగా రిసీవ్ చేసుకునేది, ఫాలో అయ్యేది యూత్ మాత్రమే.

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా, సరియైన పద్ధతిలో మన మెటీరియల్‌ను అందివ్వగలిగితే, మన టార్గెట్ గ్రూప్‌గా యూత్‌ని నిర్ణయించుకోగలిగితే యాభై శాతం బిజినెస్ జరిగిపోయినట్లేనని పారిస్ ఫ్యాషన్స్ ట్రేడ్ మార్కెట్ భావిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా గత రెండు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే, అన్ని రంగాల్లోనూ సగానికి పైగా మార్పులకు కారణం యువత మాత్రమే. మన దేశంలో కూడా అదే పరిస్థితి వుంది.

1960 ప్రాంతాల్లో హిందీ సినిమాల్ని తీసుకుంటే-- రాజేష్‌ఖన్నా, దేవానంద్, మాలాసిన్హా, సైరాభాను ..... ఆనాటి అబ్బాయిలు, అమ్మాయిలు వీళ్ళను ఎలా అనుకరించారో అందరికీ తెలుసు. ఆ తర్వాత యాంగ్రీ యంగ్‌మెన్ అమితాబ్. అమితాబ్ హెయిర్ స్టాయిల్ ఇప్పటికీ చెక్కుచెదరకుండా వుంది. అప్పట్లో విలన్ అయిన శత్రుఘ్నసిన్హాకు షూటింగ్‌లో ముఖం మీద గాయమైంది. కానీ ఆయన అభిమానులు తాము కూడా ఫ్యాషన్ కోసం తమ ముఖాలమీద గాయాలు చేసుకుని తిరిగారు. మన తెలుగు సినిమాల ప్రభావాన్ని కూడా తక్కువగా అంచనా వెయ్యడానికి వీలులేదు. రామారావులా నడవడం ఒకప్పటి ఫ్యాషన్. నాగేశ్వరరావులా వేలు చూపెట్టటం ఒక ఫ్యాషన్. వాణి శ్రీ కట్టుకున్న చీరలని, దసరాబుల్లోడు ఓణీలని, చంద్రకళ గాజులని, కమల్‌హాసన్ కొత్తగా సినిమాల్లోకి వచ్చిన రోజుల్లో ఆయన్ని అనుకరిస్తూ కుర్తా, పైజామాల్ని తొడిగేవారు. అలాగే ప్రస్తుతం చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ ఫ్యాషన్ ఒక ప్రవాహం.

ఆ ప్రవాహానికి ఊపిరి యువత.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌ని తయారుచేసుకుంది మహతి.

అందులో మొదట తన ఏజ్ గ్రూప్ అమ్మాయిల అభిరుచిని అంచనా వేసుకుంది. అందుకు అనుగుణంగా ఒక పాతిక డ్రస్సుల్ని మాత్రమే తయారుచేసింది. వాటికి ఫినిషింగ్ టచ్‌ని మాత్రం తన ఇంట్లోనే రహస్యంగా ఇచ్చింది. కనీసం వనజాక్షికి కూడా చెప్పలేదు.

"మొదటి బ్యాచ్ తయారుచేశావట. ఒకసారి చూపించవా?" వనజాక్షి ఒకసారి అడిగింది మహతిని.

"లేదు మేడమ్! ఆ మెటీరియల్‌ని మార్కెట్లోనే మీరు చూస్తారు" చిరునవ్వుతో జవాబిచ్చింది మహతి. మరో ప్రశ్న వెయ్యలేదు వనజాక్షి.

కానీ పూర్తయిపోయిన పాతిక డ్రస్సులు అప్పటికి మహతి రూమ్‌లోనే ప్యాక్‌చేసి వున్నాయి.

వాటిని ఏం చెయ్యాలో, ఎలా మార్కెట్ చెయ్యాలో అర్థంకాక తల బద్ధలు కొట్టుకుంటోంది మహతి.

ఎన్నో రకాలుగా ఆలోచిస్తోంది. కానీ ఏ ఒక్క ఆలోచనా ఆచరణకు పనికిరావడలేదు.

తను అనుకున్నది సక్సెస్ కాకపోతే--

తన ప్రయత్నం ఫెయిలైపోతే--

బెంగ పట్టుకుంది మహతికి.

ఇరవై నాలుగ్గంటలు, నలభయ్యెనిమిది గంటలు--

రెండురోజుల్నుంచి రూమ్ కదలని మహతి, గదిలో బోర్‌కొట్టి బయటికొచ్చింది.

నడుస్తూ చిక్కడపల్లివేపు వెళుతోంది.

ఎక్కడైనా కాఫీ తాగాలని ఆగి, అటూ ఇటూ చూస్తున్న మహతి తన వెనగ్గా ఓ కారు ఆగడం, ఆ కారులోంచి ఓ అమ్మాయి దిగి గట్టిగా పట్టుకోవడంతో--

ఆశ్చర్యంగా తలతిప్పి చూసింది.

ముక్త .....

తన క్లాస్‌మేట్.

"మహీ! నువ్వేనా? ఎవరో అనుకుని చూస్తున్నాను తెల్సా! నువ్వు రోడ్డుమీద ఇలా ..... ?!"

ఆశ్చర్యపోతూ అడిగింది ముక్త.

"బాగున్నావా? మన ఫ్రెండ్సందరూ బాగున్నారా?" మహతి అడిగింది.

కాలేజీలో వున్నప్పుడు రైవల్ గ్రూప్‌లో వుండే ముక్త. ఫ్యాషన్ల విషయంలో మాత్రం మహతినే అనుకరించేది.

"ఏం ఫ్రెండ్స్ ..... నువ్వు మానేసిన వారంలోనే నేనూ మానేశాను. మొన్ననే మ్యారేజ్ అయిపోయింది మా బావతో. తను అమెరికాలో ఇంజనీర్. బై ది బై! ఎల్లుండే రిసెప్షన్. నీ అడ్రస్ దొరక్క ఎంత బాధపడ్డానో తెల్సా! పోనీలే ఇప్పుడైనా కనిపించావ్. రిసెప్షన్ ట్విన్స్ కాంప్లెక్‌లో ..... సాయంత్రం ఆరుగంటలకు. వస్తావు కదూ?" గబగబా అంది ముక్త.

"వస్తాలే" అంది మహతి నవ్వుతూ.

కారు ముందుకెళ్ళిపోయింది. మహతి రోడ్డు దాటి ఓ రెస్టారెంట్లో కెళ్ళి కూర్చుని కాఫీ ఆర్డర్‌చేసి ఆలోచిస్తోంది.

కాఫీ తాగి బయటికొస్తున్నప్పుడు--

ఓ ఆలోచన ఫ్లాష్‌లా కదలాడింది. అంతే ..... మహతి పెదవుల మీద ఓ చిరునవ్వు మెరిసింది.

*　　　*　　　*　　　*

పెట్రోల్‌బంక్‌కు దూరంగా ఓ కారాగింది. ఆ కారులోంచి ఒకామె దిగి పెట్రోల్ బంక్‌వేపు వచ్చింది. వరసగా ఆగిన కార్లు, ఆ కార్లలో ఆయిల్ పోస్తున్న కుర్రాళ్ళు, దూరంగా ఆఫీసురూమ్‌లో కూర్చున్న వ్యక్తులవేపు చూసి ఆఫీస్‌రూమ్ వేపు వచ్చిందావిడ.

"చూడండి ..... మధుకర్ ..... అని ..... " ఆ మాటకు బంక్ ఓనర్ తలెత్తిచూసి--

"అతనిది నైట్ డ్యూటీ అమ్మా" వినయంగా చెప్పాడు.

"ఎన్ని గంటలకొస్తాడు?" మళ్ళీ అడిగిందావిడ.

"ఏడుగంటల కొస్తాడమ్మా" ఆ జవాబు విని నిరాశగా వెళ్ళి పోతున్న ఆవిడవేపు అలాగే చూస్తూ వుండిపోయాడు అశోక్ కుమార్.

"కొంపదీసి మధుకర్ మదర్ కాదుగదా" మనసులోనే అనుకున్నాడు. అడిగి రూమ్‌కి తీసుకెళితే ఆ ఆలోచనరాగానే పరుగు పరుగున రోడ్‌మీదకెళ్ళాడు.

కానీ అప్పటికే కారు ముందుకు కదలిపోయింది.

"మొన్న నువ్వు చూసినపుడు బాబు బాగున్నాడా" డ్రైవర్ని అడిగింది భువనేశ్వరి.

"చీకటి కదమ్మా ..... "

"అయినా అమ్మా నాకు తెలీకడుగుతాను- చిన్నబాబేటి ఇంటి లోంచి వెళ్ళిపోవడమేమిటి. పెట్రోల్‌బంకులో పనేటి" డ్రైవర్‌వేసే ప్రతి ఒక్క ప్రశ్నకూ ఆవిడ మనసు బాధపడింది.

"ఆయనకు తెలీకుండా ఎలాగయినా బాబుని నాకు చూపిస్తావా ...రావులూ ..."

"అదెంత మాటమ్మా. ఇంటికి రమ్మంటే ..... చినబాబు వస్తారో రారో ..... "

"వాడు రాకపోతే, వాడెక్కడుంటున్నాడో ..... అక్కడికి నేనే వెళ్తాను." పైటచెంగుతో కళ్ళొత్తుకుంటూ అంది.

*    *    *    *

విశాలమైన ట్విన్స్ కాంప్లెక్స్ బిల్డింగ్.

అప్పటికి ఫంక్షన్స్ ప్రారంభం కావడానికి గంటన్నర టైముంది. ముక్త, మహతి మరికొందరు ఫామిలీ మెంబర్స్ వున్నారక్కడ.

"ఫోన్‌లో ఏదో చెప్పావుకాని ..... నాకేం అర్థంకాలేదు. ఇప్పుడు చెప్పు" మొగలిపూలజడను అల్లించుకుంటూ అంది ముక్త.

"ఏంలేదే . నీ రిసెప్షన్ పార్టీలో నువ్వు గ్రీక్‌గాడెస్ వీనస్‌లా, క్లియోపాత్రలా, మార్లిన్‌మన్రోలా, రేఖలా, క్వీన్ ఆఫ్‌ది బ్యూటీక్వీన్స్‌లా కన్పించాలని ..... నీకో రేర్ ప్రెజెంటేషన్ తెచ్చాను--" చెప్పింది మహతి.

"వాట్స్ దట్. వేరీజ్ ఇట్." మహతి చేతిలోని పాకెట్ వేపు చూస్తూ అడిగింది ముక్త.

"కానీ ఒన్ కండిషన్. ఇవాళ నేన్నిన్ను తయారుచేస్తాను. అప్పుడే నా ప్రెజెంటేషన్ ఏమిటో నీకు తెలుస్తుంది" గర్వంగా నలుగురివేపు చూస్తూ చెప్పింది మహతి.

"ఓ. కే. పద నా బెడ్‌రూంలో కెళ్దాం." మహతి చెయ్యి పట్టుకుని లోనికి లాక్కెళ్ళింది ముక్త. తలుపులు మూసుకున్నాయి. ముక్త ఎగ్జయిటింగ్‌గా వుంది.

సరిగ్గా ఆరున్నరైంది.

ట్విన్స్ కాంప్లెక్స్ లాన్స్ రంగు, రంగుల విద్యుద్దీపాల వెలుగుల్తో వెన్నెల వసంతంలా వుంది.